# ప్రాణమిత్రుడు

రాత్రి ఎనిమిది కావస్తున్నది. రాజు తన రూములో కూర్చుని దీక్షగా చదువుకుంటున్నాడు. మేడ పైన గదిలో ఎవరూ అతన్ని డిస్టర్బు చెయ్యరు. రాజు తల్లిదండ్రులు, అతని చెల్లెలు క్రింద వుంటారు. కింద వరండా, బెడ్ రూమ్, హాలు, వంటిల్లు .... లోపలి నుంచే మేడపైకి పోవడానికి మెట్లు మేడ మీద ఒకే గది.... ఓపెన్ వరండా.

పై వరండా చుట్టూ వేప చెట్లు, జామచెట్లు, పూలకుండీలు, పక్కల మేడలు లేవు. ఏకాంతం బాగా లభిస్తుంది.

చదువుకోవడానికి చాలా అనువైన ప్రదేశం. అందుకే రాజు పై గదిని ఎంచుకుంది. అర్ధరాత్రి దాకా చదివి ఎప్పుడు పడుకుంటాడో అతనికే ఎరుకుండదు.

డిగ్రీ ఫైనలియరులో ఉన్నాడు. కష్టపడి చదివి మంచి ర్యాంకు సంపాదించాలని అతని తాపత్రయం.

టి.వీ. చూస్తున్న రామారావు భార్య సీతమ్మ తలతిప్పి చూసింది గుమ్మం దగ్గర ఎవరో నిలబడుంటే....

రవి, ఒక్క క్షణం ఆశ్చర్యపోయింది. కాంపౌండు వాల్‌కున్న ఇనుపగేటు ఎవరొచ్చినా బాగా శబ్దం చేస్తుంది. దాన్ని పట్టి ఎవరో వస్తున్నారని తెలుసుకుంటారు కాలింగ్ బెల్ లేకుండానే. ఒక్కసారి ఆ గడియ తీసి గేటులాగే చప్పుళ్ళు తేడాతోనే ఎవరొస్తున్నది గ్రహిస్తూ ఉంటారు.

గేటు చప్పుడు లేకుండా లోపలికి వచ్చాడు రవి. రవి రాజుకు మంచి మిత్రుడు ప్రాణమిత్రుడు అని కూడ పిలవచ్చు.

"ఆంటీ.... రాజున్నాడా!"

"ఆ! చప్పుడు కాకుండా ఎలా వచ్చావు?"

"మీరు... మీరు టి.వీ.చూస్తున్నారుగా, అందుకని గమనించలేదు. రాజును పిలుస్తారా?'

"ఫర్వాలేదు నువ్వు పైకెళ్ళు. ఎప్పుడూ వెళతావుగా ఇవ్వాళ కొత్తగా అడుగుతున్నావు!"

సీతమ్మ కలర్ టి.వీ.లో వస్తున్న సిన్మాలో లీనమైపోయింది. రాజు చెల్లెలు అనిత బెడ్‌రూములో చదువుకుంటున్నది. రామారావు బయట తిరిగి కొంచెం పొద్దుపోయిగాని యింటికి రాడు. అప్పటి దాకా సీతమ్మకు టి.వీ. మంచి నేస్తం. ఆ మాటకొస్తే ఈ ఆధునిక జీవితపు విషకోరల్లో ఒంటరిగా మిగిలిపోయిన ఎంతో మందికి మంచి నేస్తం నేటి ఇడియట్ బాక్సు అనే రంగుల హరివిల్లు.

"రాజూ!" మెల్లగా పిలిచాడు.

పుస్తకంలో తలదూర్చిన రాజు పరిచిత కంఠం వినపడడంతో తల తిప్పి చూశాడు.

రవి!

"హలో రవి! కమాన్! చాలా కాలంగా కనపడ్డంలేదు. లైఫ్ బోరు కొట్టేస్తున్నది. సబ్జెక్ట్సులో కొన్ని డౌట్లున్నాయి. ఎవరిని అడుగుదామన్నా దొరకరు. బిజీ కూర్చో!" ఆప్యాయంగా పలకరించాడు.

"రాజూ! ఈ గదిలో ఎందుకు కాస్త అలా బయటికి వచ్చి రిలాక్సు కావచ్చుగా. పొద్దున్నించి ఏకబిగిన చదువుతున్నట్లున్నావు. బయటకు పోదాం!" రవి అన్నాడు.

"రవీ! ఎంత చదివినా తరగడంలేదు. ఏ చాప్టరు వదిలేస్తే ఏ ప్రశ్న వస్తుందోనని భయం. దేవుడు రోజుకు కేవలం ఇరవైనాలుగు గంటలే ఎందుకిచ్చాడో అర్థం కావడంలేదు."

"అంతే మరి. ఇలా చదువుకుంటూ పోతుంటే చివరికి జీవితం అంటే ఏమిటో కూడా అర్థం కాదు. అందుకే ఓ రెండు గంటలు చదివితే కనీసం ఓ పదిహేను నిమిషాలు రెస్టు వుండాలి. అప్పుడే కళ్ళు కాని మెదడు కాని రిలాక్సు అయ్యేది. కాస్త అలా చల్లగాలిలో తిరిగొస్తే రిఫ్రెష్ అవుతావు." రవి ఉవాచ.

"ఓకే... ఓకే... ఓ రెండు నిమిషాల్లో డ్రస్సు చేసుకుంటాను. ..." రాజు గబగబ హేంగరుకున్న ఫ్యాంటు చొక్కా తీసుకున్నాడుఇ. చుట్టుకున్న లుంగీ విప్పేసి.

రవి తృప్తిగా తలాడించాడు.

"యూ ఆర్ వెరీ స్మార్ట్!" రవి కాంప్లిమెంట్.

"నైస్... లెటజ్ గో....."

ఇద్దరూ రూము తలుపు గడియ పెట్టి కిందకొచ్చారు. సీతమ్మ టీ.వీ.లోంచి బయట పడలేదు. మామూలుగా ప్రకటనలిచ్చి ప్రాణం తీసే ఆ ఛానెల్లో.... అప్పుడు ప్రకటనలు కూడా లేవు. పాత సినిమా కదా... ఎవరిస్తారు ఎక్కువగా?

"అమ్మా! నేను అలా బయటికి వెళ్లొస్తాను." రాజు అన్నాడు గోముగా.

"ఎక్కడికి?" తల తిప్పకుండానే అడిగింది సీతమ్మ.

"అలా వాకింగ్‌కు...." చెప్పాడు రాజు.

"చదివి చదివి బోర్ కొట్టిందా!" యథాలాపంగా అడిగింది.

"కాదమ్మా. రవి వస్తేనూ అలా బయటకు వెళ్ళివద్దామంటే.... వెళ్ళొస్తా!" రాజు చెప్పాడు.

"అట్లానా. సరే బాబు భద్రం రాత్రిపూట జాగ్రత్తగా ఉండాలి. కాలం అసలే

బాగాలేదు." సీతమ్మ చెప్పింది టి.వీ. చూస్తూ.

"ఓకే అమ్మా తలుపేసుకుంటావా?"

"అక్కరేలేదు గాలొస్తుంది ఉండనీ...."

"వస్తా ఆంటీ!"

"వస్తూండు రవి...." సీతమ్మ తల తిప్పలేదు.

మిత్రులు యిద్దరూ బయటకు నడిచారు. కాంపౌండు గేటు గడియ, తలుపు పెద్ద చప్పుడు చేశాయి. ఇద్దరూ బయటకు వెళ్ళినట్లు గ్రహించింది సీతమ్మ. టి.వీ.లో నిమగ్నమై పోయింది.

ఎంత సేపయిందో...

గేటు చప్పుడు రఫ్‌గా వినిపించింది.

"ఓహో! ఆయన వస్తున్నట్లున్నారు." అనుకుంది సీతమ్మ. కాస్సేపటికి రామారావు వచ్చాడు.

"ఇంకా టీ.వీ. చూస్తున్నావా అన్నం తిందామా?" విసుగ్గా అన్నాడు.

"మీదే ఆలశ్యం" చెప్పింది సీతమ్మ టీ.వీ. ముందు నుంచి లేస్తూ. టీ.వీ. అంటే రామారావుకు కోపం. టీ.వీ.చూడ్డంతోనే సీతమ్మ తనను నిర్లక్ష్యం చేస్తున్నదని అతని అనుమానం. ఆరోపణ.

అందుకని రామారావు ఇంట్లో ఉన్నప్పుడు సీతమ్మ టీ.వీ. చూస్తున్నా చూడనట్లు నటిస్తుంది. సౌండు కొంచెం తగ్గించి పెట్టుకుంటుంది.

కంచాలు కడిగి డైనింగ్ టేబుల్ మీద సర్దింది అనిత. రామారావు కుర్చీలో కూర్చున్నాడు కంచం ముందు అనిత. సీతమ్మ వడ్డిస్తున్నది.

"అనితా! రాజును పిలు. వాడు చదవడం మొదలుపెడితే తిండి తినడం కూడా మర్చిపోతాడు." రామారావు చెప్పాడు.

అనిత మేడపైకి పోయి చూసి వచ్చింది. "తలుపు వేసుంది. అన్నయ్య లేడు...." అనిత చెప్పింది.

"ఎక్కడికి వెళ్ళాడు?" రామారావు అడిగాడు ఆశ్చర్యంగా టైము చూస్తూ, రాత్రి పది అవుతున్నది. ఎక్కడికి పోయినా ఈ సరికి యింట్లో ఉంటాడు రాజు. అంత క్రమశిక్షణలో పెరుగుతున్నాడు.

"వాళ్ళ ఫ్రండు వస్తే బయటకు వెళ్ళాడు." సీతమ్మ చెప్పింది.

రామారావుకు కొంచెం కోపం వచ్చింది. పరీక్షల టైములో ఫ్రండ్సుతో తిరగడమేంటి!

"ఎవడా ఫ్రండు?" కోపంగా అడిగాడు.

"రవి...." సీతమ్మ యధాలాపంగా చెప్పింది. "మీరు కానివ్వండి. వాడొస్తాడులేండి."

"ఎవరూ...రవి!" ఆశ్చర్యంగా అడిగాడు.

"రవి అంటే రవే! మీకు తెల్సుగా!" విసుగ్గా అంది.

"అంటే జయసూర్యారెడ్డిగారి అబ్బాయా?" అడిగాడు సందేహంగా.

"అబ్బా! మీకన్నీ అనుమానాలే ఎంత మంది రవులుంటారు. అతనే వచ్చింది" సీతమ్మ టీ.వీ.వంక చూస్తూ చెప్పింది.

"నీకేమన్నా తిక్కలేచిందా! రవి రావడమేంటి?" ఎగతాళిగా అన్నాడు రామారావు.

అనిత కూడ అందుకుంది "అవునమ్మా వచ్చినవాడిని నువ్వు పోల్చుకోలేక పోయి వుంటావు!"

"ఛ! మీరిద్దరూ నన్ను తెలివి తక్కువ వాజమ్మని చేస్తున్నారు. నాకు వాడి ఫ్రండ్సు పేర్లు తెలియవా! అందులో వీడెప్పుడూ ఆంటీ అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ వుంటాడు." చెప్పింది రోషంగా.

"సరే! రేపు సైకియాట్రిస్టు దగ్గరికి తీసుకుపోతా!" ఎకసెక్కంగా అన్నాడు రామారావు.

సీతమ్మకు ఒళ్ళు మండింది. పోయి టి.వీ. దగ్గర కూర్చుంది.

"ఏయ్! ఇటురా!"

"నేను రాను...."

"సీతా! అన్నం తిందువు కానిరా!" కోపం తగ్గించుకొని పిలిచాడు.

"మరి నన్ను ఎందుకు ఎగతాళి చెయ్యాలి!" అలిగి అడిగింది.

"అదికాదమ్మా. రవి అని నువ్వు చెప్తే నాకు నవ్వొచ్చింది." అనిత చెప్పింది.

"అంత నవ్వాల్సిన విషయం ఏముంది?" రోషంగా అడిగింది.

"ఇంకా అర్థం కాలేదు మీ అమ్మకు... అందుకే టీ.వీ.చూడ్డం ఆపమన్నారు. ఆ టీ.వీ. చూడ్డంలో పడితే కనీసం తన పేరన్నా తనకు గుర్తుంటుందో లేదో."

"ఇంతకీ ఏంటట!" అటా కింగ్ మూడ్‌లో వస్తూ అడిగింది. ఆమెకు ఎవరన్నా తన టీ.వీ.ని బ్లేమ్ చేస్తే చచ్చేటంత కోపం వస్తుంది.

"అమ్మా! రవి చనిపోయి దాదాపు మూడు నెలలు కావొస్తున్నది కదమ్మా!" అనిత నవ్వు మునిపంటితో ఆపుకుంటూ చెప్పింది.

అంతే! సీతమ్మ కెవ్వున కేక పెట్టి పడిపోయింది.

రామారావు నీళ్ళు జల్లాడు ఆమె మొహం మీద. అనిత లేవదీసింది.

"ఓసీ! నీ దుంపతెగ! ఏం జరిగిందే!" కంగారును అణుచుకుంటూ అన్నాడు రామారావు.

"అదికాదండి... ఆ వచ్చింది రవేనండీ!" వణుకుతూ చెప్పింది.

"అందుకే ఆ టీ.వీ.లో వచ్చే క్షుద్ర సీరియల్స్ చూడవద్దన్నాను. దయ్యాలు, భూతాలు సీరియల్సు చేసేది. పగటి కలలు కనేది. భయపడి చచ్చేది." రామారావు విసుక్కున్నాడు.

"లేదండి... ప్లీజ్. నన్ను నమ్మండి వచ్చింది వాడేనండి. నేను స్పష్టంగా చూశాను నాతో మాట్లాడాడు." వణుకుతూ చెప్పింది.

"ఏ, అనితా! నువ్వు చూశావా!" సందిగ్ధంలో పడుతూ అడిగాడు.

"లేదు నాన్న! నేను చదువుకుంటున్నాను బెడ్‌రూమ్‌లో...." అనిత కంగారుగా చెప్పింది.

"ఎందుకే ఒళ్ళంతా అంత చెమటలు పడుతున్నాయి. ఏందుకే ఆ వణుకు...." రామారావు బాగా కంగారు పడ్డాడు.

"ఏమండి.... నా గుండె.. దడ... దడ కొట్టుకుంటున్నది. కాస్త మంచినీళ్లు యివ్వండి." పాలిపోతూ అడిగింది.

వెంటనే అనిత మంచినీళ్ళు యిచ్చింది.

రామారావుకు ఫస్టు ఎయిడ్ గుర్తుకొచ్చింది. వెంటనే తేనె తాగించాడు. గ్లూకోజ్ నీళ్ళల్లో కలిపి యిచ్చాడు.

అనిత వెంటనే డబ్బాలోని సాయిబాబా విబూది ఆమె నుదిటిన పెట్టింది.

కాస్త తెప్పరిల్లింది సీతమ్మ.

"ఇప్పుడెలా ఉంది," రామారావు అడిగాడు ఆత్రంగా.

"నాకు బాగుందండి నా గురించి కాదండి నా కంగారు..... రాజుకు ఏమైందోనని.. వాడెక్కడున్నాడోనని...."

అప్పుడు రామారావు ఎలర్టు అయ్యాడు. నిజమే అతను దెయ్యాలను భూతాలను నమ్మడు. హేతువాది. కానీ, తన సహధర్మచారిణి చెబుతుంటే నమ్మకుండా ఎలా వుంటాడు?

"అయితే నే వెతుకుతాను..." డ్రస్ చేసుకుంటూ చెప్పాడు.

"నేను వస్తాను...." సీతమ్మ చెప్పింది.

"అమ్మా నేకూడ వస్తాను. నాకు భయంవేస్తున్నది." అనిత అన్నది. రామారావు అభ్యంతరం చెప్పలేదు.

చేతికి అంది వస్తాడనుకుంటున్న కొడుకు ఇలా అయిపోవడంతో అతనికి చెప్పరాని

భయం ఆవరించింది.

ఇంటికి తాళం పెట్టి ముగ్గురూ వెతకడానికి బయటపడ్డారు.

రాజు, రవి క్లాసుమేట్లు. ఇద్దరూ మంచి బాలురు. చదువులో మంచి ఆసక్తి కనపరచేవారు. పోటీలు పడి చదువుకునేవారు.

తరచుగా రాజు రవి యింటికి పోతూ వుండేవాడు.

అప్పుడప్పుడు రవి రాజు యింటికి వస్తూ వుండేవాడు. ఒకసారి యిద్దరూ కల్సి పిక్నిక్ కూడ వెళ్ళి వచ్చారు. "ఐ లైక్ యూ రాజు!" రవి అన్నాడు.

"వై? ఎందుకు," రాజు.

"ఎందుకో నువ్వంటే యిష్టం, నీ సిన్సియారిటీ, సెల్ఫ్ రెసీపెక్ట్, స్నేహం చేసే మనసు, నీ పర్సనాలిటీ అన్నీ నాకు యిష్టం. ఇన్ని చెప్పినా నీకు తెలియంది కాదు ఎవరికి ఎవరి మీద యిష్టం ఎందుకు కలుగుతుందో ఎవరికీ తెలియదు. బహుశః పూర్వజన్మ వాసనలు యిద్దర్ని కలుపుతూ ఉండవచ్చు." రవి అన్నాడు గంభీరంగా.

"అలాగే విడదీయనూ వచ్చుగా?"

"ఆ! కాని మన విషయంలో ప్రాణం ఉన్నంత వరకు కలిసే వుంటాం. నిజం చెప్పాలంటే ప్రాణం పోయినా నిన్ను వదల్ను నేను." రవి హాస్యంగా అన్నాడు.

రాజు నవ్వాడు. "అందుకే మనిద్దరం ప్రాణస్నేహితులం."

"కానీ పెళ్ళి చేసుకుంటే మన స్నేహాన్ని మన భార్యలు అర్ధం చేసుకుని హర్షిస్తారా లేదా!" రవి సందేహం.

"సింపుల్! పెళ్ళి చేసుకోకుండా ఉంటే సరి." రాజు నవ్వు.

"ఇది జీవితం. చెప్పినంత సులభం కాదు. అయినా మన చేతిలో ఏముంది కనుక." ఎందుకో రవి అన్నాడు.

అది జరిగిన వారంకు రవి లేడు.

బర్త్‌డేకు స్వీట్లు రాజుకు పంచి వద్దామని సైకిల్‌మీద బయలుదేరిన రవిని అదుపు తప్పిన సిటీ బస్సు వెనుకనించి కొట్టింది. బ్యాలెన్సు తప్పికింద పడిపోయిన రవి మీదనుంచి సిటీ బస్సు వెళ్ళిపోయింది. ఆన్ ది స్పాట్ చనిపోయాడు రవి.

అదొక షాక్ రాజుకు!

వాతావరణం మార్పుకని కొన్నిరోజులు రామారావు రాజును బంధువుల యింటికి పంపించాడు పట్టణంకు.

కాలం గొప్పవైద్యుడు కాబట్టి శారీరక గాయాలతో పాటు, మానసికగాయాలకు కూడ మందు వేస్తుంది.

పైగా కుర్రవయస్సు. పైగా చదువుల ఒత్తిడి.

ఏతావాతా రాజు.... ఆ జ్ఞాపకాలలోంచి బయటపడ్డాడు. అతని ఇంట్లోని వాళ్ళుకూడ క్రమంగా రవిని మర్చిపోయారు.

రోడ్డుమీద చిక్కటి చీకటి అలుముకుంది. గుడ్డిదీపాలు మసకవెలుతురు ప్రసరిస్తున్నాయి. "ముగ్గురం మూడు దిక్కులా పోదామా?" రామారావు అడిగాడు. "వద్దు, నాకు భయంగా ఉంది." సీత్మమ వెంటనే చెప్పింది.

"అనిత! నువ్వు వెళతావా?"

"వద్దండి.. వయసొచ్చిన పిల్ల! రాత్రిపూట మంచిదికాదు." సీతమ్మ వారించింది.

చుట్టుప్రక్కల ఉన్న రాజు స్నేహితుల యిళ్ళల్లో విచారించారు మొదటగా రాజు వచ్చాడా అని.

చాలామంది చూడలేదన్నారు. కొందరు ఒంటరిగా రోడ్డుమీద పోతూంటే చూశామన్నారు. ముగ్గురు వీధిన పడి వెతకడం వారికి ఆశ్చర్యం కలిగించింది. మెయిన్ రోడ్డుమీద కొచ్చేసరికి ఆటో కనిపించింది. అతని మొహం కొంచెం పరిచయంగా ఉంది.

"మా అబ్బాయి రాజు ఇంటికి రాలేదు... వెతకాలి... ఎంత?" రామారావు, "చూసి యివ్వండి. మీకు తెలియందేముంది?" ఆటోవాలా సానుభూతి చూపిస్తూ చెప్పాడు.

వెంటనే ముగ్గురూ ఆటోలో ఎక్కి బయలుదేరారు. ఆ ఊరిలోని ముఖ్య వీధులన్నీ తిరుగుతున్నారు. ఎక్కడైనా రోడ్డువారగా ఉంటాడేమోనని వెతికారు. ఫుట్ పాత్ పక్కన కూర్చున్నవాళ్ళ దగ్గరికి పోయి చూశారు.

సెంటర్‌లో మాట్లాడుకుంటున్న వ్యక్తుల్ని రాజు పోలికలు చెప్పి అడిగాడు.

అంతా తెలీదని చెప్పారు.

గంట.... రెండు గంటలు... మూడు గంటలు సుమారుగా సమయం రాత్రి ఒంటిగంట.

అసలే అమావాస్య!

జనసంచారం పూర్తిగా తగ్గిపోయింది. ముగ్గురూ అలసిపోయారు.

"నాన్న పోలీస్‌స్టేషన్‌లో కంప్లెయింట్ యిద్దామా?" అనిత సలహా యిచ్చింది.

"చూద్దాం - దొరక్కపోతే అలాగే చేద్దాం." నిరాసక్తంగా అన్నాడు.

"ఏవండీ! ఒకవేళ వీడు స్మశానం వైపు వెళ్లి వుంటాడా - మనం వెతకంది అటువైపే గదా!" తన అనుమానం వ్యక్తపరిచింది.

"అటు ఎందుకుపోతాడు?" రామారావు.

"అమ్మో! స్మశానమే - నాకు భయం" అనిత.

"చూద్దాం - పదండి ఆటోవాలా చొరవ చూపించాడు.

ఊరికి ఉత్తరాన స్మశానంలో ఆటో ప్రవేశించింది. ఒళ్ళు గగుర్పొడిచింది.

పక్షుల వింత శబ్దాలు, నక్కల ఊళలు కీటకాల రొద! అక్కడక్కడ మండుతున్న చితులు.. నల్లటి చీకటిలో నిల్చున సమాధులు... భీకరంగా వీస్తున్న చల్లటిగాలి...

దూరంగా వెలుగుతున్న వీధి దీపాల మసక కాంతి...

"రాజు!" రామారావు బిగ్గరగా అరిచాడు.

ఆటోవాలా ఆటోలైటు ఆన్‌లో వుంచాడు.

సంచీలోంచి బ్యాటరీ లైటు తీసి రామారావు ముందుకు నడిచాడు ధైర్యం కూడగట్టుకుని. సీతమ్మ బిక్కుబిక్కుమంటూ ఆటోలో ఉండిపోయింది. అనిత ఆటో ముందు నిలబడింది.

ఆటోవాలా నాల్గుదిక్కులా చూస్తున్నాడు. కెవ్వున కేక!

"అబ్బా!" ఆర్తనాదం వినిపించింది.

అది ఖచ్చితంగా రామారావుదే!

గుండె గుబగుబలాడుతుంటే "ఏవండీ!" అని సీతమ్మ.

"నాన్న!" అని అనిత పిల్చారు. కిందపడిన టార్చిలైటు నేల మీద దొర్లుతూ సమాధుల మీద కాంతిని ప్రసరిస్తున్నది.

"హెల్ప్!" రామారావు కేక నిశీధిలో -

"బాబు! కొంచెం పోయి చూస్తావా!" సీతమ్మ ఆటోవాలాను అడిగింది.

"ఆ! మీరు వస్తే పోదాం!" ఆటోవాలా జంకాడు.

ధైర్యం చిక్కబట్టుకుని ముగ్గురూ కదిలారు. నేలమీద పడున్న టార్చిని చేతిలోకి తీసుకుని ఆటోవాలా నేలమీదకు ఫోకస్ చేశాడు.

రామారావు నేలమీద బోర్లాపడున్నాడు.

వెళ్ళి అతన్ని లేపాడు. రాయి తలకి కొట్టుకుంది కావునూ నెత్తురు కారుతున్నది.

"ఏమైంది?" సీతమ్మ కంగారు.

"రాజు..." వేలుతో చూపించాడు రామారావు.

టార్చి వెలుతురులో ఒక ఆకారాన్ని గుర్తుపట్టారు. ఒక సమాధి దగ్గర రాజు.....నేల మీద పడున్నాడు. శ్వాస బలంగా తీస్తున్నాడు.

ఆటోవాలా టార్చిలైటులో సమాధి మీదున్న పేరు చదివాడు. రవి... ముగ్గురూ

అతన్ని చేతుల్లోకి తీసుకుని ఆటోలోకి చేర్చారు.

'రయ్' మని ఆటో ఆసుపత్రికి పరుగుతీసింది.

లక్కీగా అది ప్రైవేట్ హాస్పిటల్! 24 గంటలు పనిచేస్తుంది. డ్యూటీ డాక్టర్ కూడ వున్నాడు.

చకచక ట్రీట్‌మెంట్ జరిగింది.

మరునాడు ఉదయం రాజుకు మెలకువ వచ్చింది.

మనిషి వణికిపోతున్నాడు. మాట తడబడుతున్నాడు.

"ఏమైంది?" రామారావు అడిగాడు

"ర..వి....." చెప్పాడు.

నుదుటిమీద చెయ్యి పెడితే కాలిపోతున్నది. డాక్టర్ ఇంకో యింజెక్షన్ యిచ్చాడు.

"డోంట్ డిస్టర్బ్ హిమ్!" చెప్పాడు డాక్టర్.

ఆ సాయంత్రం రాజు కొంచెం మాట్లాడగలిగాడు - జరిగింది చెప్పాడు.

ఆ రాత్రి రాజు -రవి కబుర్లు చెప్పుకుంటూ నడుచుకుంటూ వెళుతున్నారు.

మాటల్లో రాజు పరిసరాలను గుర్తించలేదు. ఊరికి చాలా దూరం వచ్చేశాకా - చింతతోపులు - స్మశానం వైపు.

"రవీ! ఇటెందుకు ఊళ్ళోకి వెళదాం." రాజు అడిగాడు.

"లేదు... ఇటే బాగుంటుంది ప్రశాంతంగా." రవి చెప్పాడు. రవి అప్పుడప్పుడు స్మోక్ చేస్తాడు.

"స్మోక్ చేస్తావా?" రాజును అడిగాడు తాను సిగరెట్టు నోట్లో పెట్టుకుంటూ. లేదని తల ఊపాడు.

రవి అగ్గిపెట్టె తీసి అగ్గిపుల్ల వెలిగించబోయాడు. అగ్గిపెట్టె కింద పడింది.

"రాజు! అగ్గిపెట్టె తీసి ఇవ్వు!" రవి ఆజ్ఞాపించాడు.

రాజుకు చిత్రంగా ఉంది రవి ప్రవర్తన. రవి ఎప్పుడు సిగరెట్టు తాగినా యిలా ప్రవర్తించడు. సిల్లీగా తనకు పని చెప్పడు. సరే అడగక అడిగాడు కదాని తీసిద్దామనుకుని కిందకు చూశాడు.

రవి కాళ్ళు కనపడ్డం లేదు. చీకటి వలనా? ఎందుకు? ఉన్నట్టుండి రాజు మెదడులో మెరుపు మెరిసింది. రవి చనిపోయి చాలా రోజులైంది కదా! మరి తన ఎదురుగా ఉంది ఎవరు?

రాజుకు వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది. అంటే... అంటే... తను

కథా నిలయం
5884
శ్రీకాకుళం

"చూస్తావేం! అగ్గిపెట్టె అందించు...." చేతులు గాల్లోకి ఊపుతూ అడుగుతున్నాడు రవి.

"అమ్మో!" రాజు షాక్ తిన్నాడు. భయంతో వళ్ళు చల్లబడింది. అప్రయత్నంగా ఒకటికి. రెంటికి పోయాడు ప్యాంటులో.

రవికి తెల్సిపోయింది వాడు చేసిన పని.

తిరస్కారంగా నవ్వాడు రాజు వంక చూసి.

"వెధవ! బతికిపోయావు పో! నేను ఒంటరిగా ఉన్నాను. కంపెనీ కోసం ఈ రోజు నిన్ను ఎత్తుకుపోదామనుకున్నాను. నువ్వు వంగి అగ్గిపెట్టె తీసేటప్పుడు వెన్ను మీద ఒకటిద్దామనుకున్నాను. దాంతో నువ్వు ఫినిష్ అయ్యేవాడివి. కాని నువ్వంత పిరికి వెధవ అనుకోలేదు. ఛ....ఛ.. లాగులోనే అన్నీ చేశావు. నాకు అసహ్యం వేస్తున్నది. బతికిపోయావు పో, ఇంకా నీకు భూమ్మీద నూకలున్నాయి..." రవి చెప్పాడు.

అతనింకా ఏవో చెబుతున్నాడు కాని అప్పటికే రాజు స్పృహ తప్పి కిందపడిపోయాడు.

రెండు రోజులు గడిచినా జ్వరం తగ్గకపోయ్యే సరికి... ఆ ఊరిలోని గొప్ప సాయిభక్తుడు ఆనంద సాయి దగ్గరికి తీసుకువెళ్ళారు రాజును.

అతను షిర్డీలో చాలా కాలం సాయిబాబాను సేవించి వచ్చాడు. అక్కడ అతనికి అతీతశక్తులు చాలా వచ్చాయని ప్రజల నమ్మకం. ఆనందసాయి రాజు నుదుటిమీద 'ఊదీ' దిద్దాడు, కొంచెం 'ఊదీ' నీళ్ళలో వేసి తాగించాడు. వెన్ను తట్టాడు.

"ఇంకేం భయం లేదు. ఒకవేళ మళ్ళీ రవి కన్పించి రమ్మంటే రానని చెప్పు."

"కల్లోనా!" రాజు ప్రశ్న.

"ఎట్లా కనిపించినా సరే. కల్లో కూడ చనిపోయినవాళ్ళు వచ్చి రమ్మని పిలిస్తే వస్తామని చెప్పకూడదు. అలా చెబితే నిన్ను ఎవరూ కాపాడలేరు. గ్యారంటీగా తీసుకువెళ్ళిపోతారు." ఆనందసాయి చెప్పాడు.

"అసలు దెయ్యాలున్నాయా?" రామారావు ప్రశ్న.

"అకాల మృత్యువు వాతపడ్డ వాళ్ళు వాళ్ళ జాతకం ప్రకారం ఆయుష్షు పూర్తి అయ్యేదాకా దెయ్యాలుగా తిరుగుతూ వుంటారు. ఒకసారి దెయ్యమైన తరువాత మంచి, చెడు, జ్ఞానం నశిస్తుంది. వాళ్లకు తాము ఒంటరిగా ఉన్నామనే భావన తప్పించి ఇతరులకు తమ చర్య ద్వారా నష్టం చేకూరుస్తున్నామన్న భావన ఉండదు." ఆనందసాయి చెప్పారు.

"థ్యాంక్సు సార్! మా వాడ్ని బ్రతికించారు." రామారావు మనస్ఫూర్తిగా అన్నాడు.

"నాదేముంది అంతా ఆ సాయిబాబా దయ!" ఆనందసాయి షిర్డీసాయి పటం వంక చూపించి నమస్కరించాడు.

( సృజన ప్రియ ఆగస్టు 2000)